ప్రజాశక్తి
శుక్రవారం 29 నవంబర్ 2024 5
శ్రీ సత్యసాయి

హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఖాతా కోసం పోస్టాఫీసు కిటకిట..!

◆ రూ.1500 ప్రభుత్వ సబ్సిడీకి తప్పనిసరంటూ పుకార్లు

◆ పనులు మానుకుని వేచి ఉంటున్న మహిళలు

◆ కొత్త ఖాతా అవసరం లేదంటున్న పోస్టల్ సిబ్బంది

తపాలా ఖాతా కోసం తపాలా కార్యాలయంలో క్యూ కట్టిన మహిళలు

చిన్నారితో నేలపై కుర్చున్న మహిళ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ సబ్సిడీలు పడాలంటే తప్పని సరిగా తపాలా ఖాతా ఉండాలనే ప్రచారం ఇటీవల జోరుగా నడుస్తోంది. హిందూపురంలో ఈ పుకార్లు షికారు చేయడంతో తపాలా కార్యాలయానికి పెద్ద సంఖ్యలో మహిళలు వస్తున్నారు. మహిళలు పనులు మానుకుని నూతన ఖాతా తెరవడానికి తపాలా కార్యాలయానికి క్యూ కట్టారు. మరో పక్క కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు అపార్ ఐడీ తీసుకురావడంతో ఆధార్‌లో తప్పులు సరి చేసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తపాలా కార్యాలయానికి పెద్ద ఎత్తున వస్తున్నారు. ఓ వైపు కొత్త ఖాతాలు, మరోవైపు ఆధార్ కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుండడంతో తపాలా కార్యాలయం జనాలతో కిటకిటలాడుతోంది. తపాలా శాఖలో ఖాతా ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సబ్సిడీ నగదు పడుతుందని పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా ఇటీవల సామాజిక మాధ్యమాలలో పుకార్లు వ్యాపించాయి. దీంతో మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తపాలా కార్యాలయం వద్ద ఖాతా కోసం పడిగాపులు కాస్తున్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతి మహిళకూ నెలకు రూ.1500 వారి ఖాతాకు వేస్తామని హామీ ఇచ్చింది. ఈ డబ్బులు పడాలంటే తపాలా కార్యాలయంలో ఎన్‌పిసిఐ ఖాతా తప్పనిసరంటూ పుకార్లు రావడంతో మహిళలు నూతన ఖాతాలు తెరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాంటిదేమీ లేదంటూ పోస్టల్ అధికారులు చెబుతున్నా వారి మాటలను వినే పరిస్థితి కన్పించడం లేదు. వారం రోజుల వ్యవధిలో ఒక్క హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో దాదాపు 8వేలకు పైగా నూతన ఖాతాలను మహిళలు తెరిచారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఉదయం నుంచి వేచి ఉన్నా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే సబ్సిడీ నగదు పడాలంటే పోస్టాఫీసులో ఖాతా ఉండాలని అంటున్నారు. మరో బ్యాంకులో ఖాతా ఉన్నప్పటికీ ఉదయం నుంచి పిల్లలతో కలిసి పోస్టాఫీసుకు వచ్చి క్యూలో నిలబడ్డాను. కొత్తగా పోస్టాఫీసులో ఖాతాను తెరుస్తాను.

కీర్తి, శ్రీకంఠపురం హిందూపురం.

రూ.1500 కోసం ఖాతా తెరుస్తున్నా

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే నెలకు రూ.1500 ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు ఆ డబ్బులను పోస్టాఫీసులో ఖాతా ఉంటేనే వేస్తామంటున్నారు. దీంతో తపాలా కార్యాలయానికి ఖాతా తెరిచేందుకు వచ్చాను.

జయమ్మ, హిందూపురం.

తప్పనిసరి కాదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి వచ్చే సబ్సిడీ నగదు పడాలంటే పోస్టాఫీసులో ఖాతా ఉండాలన్నది వాస్తవం కాదు. ఏ బ్యాంకు ఖాతా ఉన్నా దానికి ఎన్‌పిసిఐ లింకు చేసుకుంటే సరిపోతుంది. పోస్టాఫీసులో ఖాతా తప్పనిసరి అని తాము ఎవరికీ చెప్పలేదు. ఇదివరకు ఉన్న బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్, ఎన్‌పిసిఐ లింక్ లేకుంటే మాత్రమే పోస్టాఫీసులో ఐపిపిబి ఖాతాను తెరుచుకోవాలని చెబుతున్నాం. ఒకవేళ పోస్టాఫీసులో ఖాతాలు కావాలంటే ఆయా సచివాలయాల పరిధిలోనే తెరిచే ఏర్పాటు చేస్తాం.

మార్కెండేయులు, పోస్టుమాస్టర్

లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు

◆ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

◆ పటిష్ట భద్రతా ఏర్పాట్లు

◆ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్



ముఖ్యమంత్రి పర్యటన ఇలా...

◆ 12-30గంII కర్నాటకలోని తోర్నగల్లు జిందాల్ విజయనగర ఎయిర్‌పోర్టు నుంచి నేమకల్లుకు బయల్దేరారు.

◆ 12-45గంII నేమకల్లు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలిప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రి చేరుకుంటారు.

◆ 1-25కు నేమకల్లు ఇందిరమ్మకాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

◆ 2-00గంII నేమకల్లు ఆంజనేయస్వామి దర్శనం

◆ 2-05గంII నుంచి 3-05గంII వరకు లబ్ధిదారులు, గ్రామస్తులతో ముఖాముఖి

◆ 3-15గంII ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

◆ 3-45గంIIకు నేమకల్లు హెలీప్యాడ్ నుంచి తిరుగు ప్రయాణం

◆ 4-05గంII జిందాల్ విజయనగర ఎయిర్‌పోర్టుకు.. అక్కడి నుంచి విజయవాడ ఎయిర్‌పోర్టుకు వెళ్లనున్నారు.

ప్రజాశక్తి-బొమ్మనహాల్

30వ తేదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా, బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామానికి వస్తున్న నేపథ్యంలో ఆయన పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ డాII.వి.వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌లు అధికారులు, పోలీసు సిబ్బందికి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నేమకల్లు గ్రామాన్ని గురువారం పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ లబ్ధిదారుల గృహాలు, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయం, గ్రామసభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్, ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. హెలిప్యాడ్ వద్ద ఆర్‌అండ్‌బి అధికారులు బ్యారికేడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి వెళ్లే రూట్ మ్యాప్‌లను పక్కాగా సిద్ధం చేయాలన్నారు. సౌండ్ సిస్టం, ఎల్ఈడి స్క్రీన్స్ ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని శానిటేషన్ తదితర వాటిపై ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలిగించకుండా, హంగూ ఆర్భాటాలకు పోకుండా సజావుగా గ్రామ సభను నిర్వహించే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, జెడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్, సర్వే ఏడీ రూప్లనాయక్, అనంతపురం మున్సిపల్ కమిషనర్ నాగరాజు, డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి అన్ని శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ఆమోదం లేని పనులను నిలిపేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక గ్రామపంచాయతీలో పంచాయతీ ఆమోదం లేకుండా చేస్తున్న పనులను నిలుపుదల చేయించాలని వార్డు మెంబర్ సాలమ్మగారి శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నటరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో అభివృద్ధి పనులు నిర్వహించాలంటే పంచాయతీ సమావేశం నిర్వహించి సభ్యులకు తెలియజేసి తీర్మానం చేయాలన్నారు. అలా చేయకుండా పనులు చేస్తున్నారన్నారు. ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బులను దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్ నందు ఐసీడీఎస్, సమతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం తొలుత అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, వైద్య సిబ్బంది తదితరులు కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ గాయత్రి, సమతా ఫౌండేషన్ ఎన్జీవో కమ్యూనిటీ మొబిలైజర్ శోభ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు ఉన్న బాల, బాలికలకు ఎట్టి పరిస్థితులలోనూ పెళ్లి చేయకూడదన్నారు. బాల్యవివాహాలు చేసుకుంటే కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరూ గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. చదువుపై ధ్యాస ఉంచి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతీదేవి, సిహెచ్ఒ నగేష్, సిబిహెచ్ రాజేశ్వరి ఏఎన్ఎంలు సుహాసిని, అర్బన్ అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది

'సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యం'

వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-మడకశిర

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. నియోజక వర్గ ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు 'టీ టైం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చేట్టారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం పట్టణంలోని 8 వార్డులో గాంధీ బజార్, చావిడి, బోయవీధి, పాతూరు కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. వార్డుల్లో తిరిగి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మన్నారు. పట్టణంలో తాగునీటి సమస్యపై నగర పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, డ్రెయినేజీ, పారిశుధ్యం, తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతిరోజూ పట్టణంలోని సమస్యలపై ఆరా తీస్తానని, సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిజిఆర్ఎస్ అర్జీపై విచారణ

ప్రజాశక్తి-చిలమత్తూరు

పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీపై జాయింట్ కలెక్టరు అభిషేక్ కుమార్ గురువారం విచారణ చేపట్టారు. చిలమత్తూరు మండలం సోమఘట్ట పంచాయతీ కొక్కవాండ్లపల్లి గ్రామం లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. రైతు కుళ్లాయప్ప జిల్లా గ్రీవెన్స్ లో భూమి విశయంపై ఇచ్చిన అర్జీపై విచారణ చేశారు. అర్జీదారుని కి సంబంధించి రికార్డులు పరిశీలించారు. అలాగే గ్రామస్తులను విచారించారు. విచారణ అనంతరం ఈ భూ సమస్య తమ పరిధిలో లేదని సివిల్ కోర్టుకు వెళ్ళాలని సూచించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యూనస్ బాబు, వీఆర్వో సోమ్లనాయక్, మండల సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలో ఆమోదం పొందిన పనులను చదివి వినిపిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహమూర్తి

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి-రొద్దం

శాఖా గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ సెస్సు వసూలు చేయాలని గ్రంథాలయ అధికారి నాగరాజును ఆదేశించారు.

గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న రమ

గ్రామసభలో పనులకు ఆమోదం

ప్రజాశక్తి-రొద్దం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా గుర్తించిన పనులకు ఆమోదం పొందేం దుకు గురువారం రొద్దం గ్రామపంచాయతీ సచివాలయం-1లో గ్రామసభ నిర్వహించినట్లు ఈఓఆర్‌డి గోవిందప్ప తెలిపారు. రైతులు వారి పొలాల్లో బౌండరీ ట్రెంచులు, ఫారం పాండ్లు, వంకల దగ్గర చెక్ డ్యాంలు, మల్బరీ మొక్కల పెంపకం, మట్టి రోడ్లకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్‌డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రూప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సోనీ, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహమూర్తి, సచివాలయ సిబ్బంది, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ బలరామిరెడ్డి

ప్రజాశక్తి - హిందూపురం

సచివాలయ సెక్రెటరీలు సమయపాలన పాటిస్తు ప్రజల సమస్యల ను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ బలరామిరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం పట్టణంలోని 6, 43వ సచివాలయాలను తనఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాయలంలో సెక్రటరీల విధి నిర్వహణ, హాజరు తదితర విషయాలను పరిశీలించారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేసే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-గుడిబండ

గుడిబండతో సహా మండలంలోని సింగేపల్లి, మోపరు గుండు, తదితర గ్రామాల్లో గురువారం టిడిపి జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు టిడిపి సానుభూతి పరులు, ప్రజలకు సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో దుర్గేష్‌తో పాటు ఎంపిటిసి శశిధర్, ఫీల్డ్ అసిస్టెంట్ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా సాగునీటి సంఘాల

ఎన్నికలు నిర్వహిస్తాం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లో రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి సాయి ప్రసాద్‌తో కలిసి సాగునీటి సంఘాల ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సాగునీటి సంఘాల నిర్వహణకు ఆమోదం తెలిపినందున జిల్లాలో సంఘాల ఎన్నికలకు సన్నద్ధం అవుతున్నామని తెలియజేశారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ సంఘాలు 214 ఉన్నాయని, మధ్యతరహా ఇరిగేషన్ సంఘాలు 16 ఉన్నాయని, మొత్తం 230 సంఘాలు ఉన్నాయన్నారు. వీటిన్నంటికీ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం డిసెంబర్ 5న నోటిఫికేషన్ ఇవ్వబోతోందన్నారు. 8న ఎన్నికలు జరుగుతాయన్నారు. మధ్యతరహా ప్రాజెక్టులకు డిసెంబర్ 14న ఎన్నికల జరుగుతాయన్నారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ విజయ సారధి, అసిస్టెంట్ ఇంజినీర్లు గంగాద్రి, జమునా బాయి పాల్గొన్నారు.

30న 'పురం' కౌన్సిల్ మీట్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

ఈనెల 30న హిందూపురం కౌన్సిల్ సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు. హిందూపురం పురపాలక సంఘం ఛైర్మన్ ఎంపిక జరిగి 15 రోజులు గడుస్తున్న కౌన్సిల్ మీట్ నిర్వహించక పోవడంతో 'ఛైర్మన్ ఎంపిక సరే... కౌన్సిల్‌మీట్ ఎప్పుడు ' అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రత్యేక కథనం వెలువడింది. దీనిపై మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ బలరామిరెడ్డి, అధికారులు స్పందించారు. కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలను చేపట్టారు. ఈ నెల 30న శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సర్వ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఛైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ మండల కేంద్రంలోని 8 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు గురువారం తమ సమ్మెను విరమించారు. 14 కార్మికులకు అధికారులు ఆర్డర్ కాపీ అందించడంతో సమ్మె తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు సిఐటియు నాయకులు పారిశుధ్య కార్మికులు తెలిపారు. మిగతా 9 మందికి ఆర్డర్ కాపీలు ఐదు రోజుల తర్వాత అందిస్తామని అధికారులు చెప్పారు. అంతకు ముందు పంచాయతీ కార్మికులు గురువారం ఉదయం జాతీయ రహదారిపై దుకాణాల వద్ద భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం పోతులయ్య, ప్రజా నాట్యమండలి బాబు, మునాఫ్, అవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్, చికెన్ రఫీ ,డ్రైవర్ బాబా, టైలర్ ముత్తు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా బాషా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న అధికారిణి

సాగు,తాగునీరు, పరిశ్రమలకు ప్రాధాన్యత

గణాంకాలు కాదు... క్షేత్ర స్థాయిలో పని జరగాలి

అనంతపురం జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రులు టిజి.భరత్, కేశవ్

డిఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు, కలెక్టర్, ఎస్పీ, జెడ్పీ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో సాగు, తాగునీరు, పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యతనిస్తామని జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లా ఇంఛార్జీ మంత్రి టిజి.భరత్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లు స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవనంలో జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం జరిగింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయం, సాగునీరు, వైద్యం, ఉపాధి హామీ పనులపై సమీక్షా జరిగింది. ఈ సమావేశంలో విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటి వెంకట ప్రసాద్, బండారు శ్రావణి, కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ ప్రారంభించాలి : కాలవ

వరి నూర్పిడి ప్రారంభమైనా ధాన్యం సేకరణ ప్రారంభమవలేదు.. కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. మంత్రి కేశవ్ స్పందిస్తూ నూర్పిడి ప్రారంభమయ్యే సమయానికి ధాన్యం సేకరణ చేపట్టాలని జిల్లా సివిల్ సప్లై జిల్లా మేనేజరుకు ఆదేశించారు. కరువు మండలాలపై కాలవతో పాటు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి అధికారుల మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి కేశవ్ స్పందిస్తూ మరోమారు అన్ని అంశాలను పరిశీలించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని సూచించారు.

హంద్రీనీవా మొదటి దశ వెడల్పు, రెండో దశ లైనింగ్

సాగునీటి మంత్రి కేశవ్ స్పందిస్తూ అనంతపురం జిల్లాకు సాగునీటిని అందివ్వాలన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. హంద్రీనీవా మొదటి దశ కాలువ వెడల్పును 3800 క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయం చేసిందన్నారు. రెండో దశలో లైనింగ్ చేపట్టి ప్రవాహ వేగాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయం చేసి, పనులను చేపట్టాలని ఆదేశించిందన్నారు. తుంగభద్ర డ్యామ్ ఎగువ ప్రధాన కాలువను మరోమారు పరిశీలించి ఎక్కడ పనులు అవసరమో ప్రతిపాదనలు పంపించాలని హెచ్‌ఎల్‌ఎంసి ఎస్ఇ రాజశేఖర్‌ను ఆదేశించారు. హంద్రీనీవా కింద 36వ ప్యాకేజీ బిటిపి, పేరూరు ఎత్తిపోతల పథకాలకు భూసేకరణ వివరాలు సమగ్రంగా రూపొందించాలని భూసేకరణ అధికారికి సూచించారు. పిఎబిఆర్ నిలువ సామర్థ్యం పూర్తి స్థాయి పెంచే అంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరగా ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించామని మంత్రి తెలిపారు.

పరిశ్రమల స్థాపనపై దృష్టి : మంత్రి టిజి.భరత్

రాయలసీమ జిల్లాలో అవసరమైనంత భూమి అందుబాటులో ఉన్నందున అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇప్పటికే ఆజాద్ అనే సంస్థతోపాటు ఆక్సా అనే అతి పెద్ద సంస్థ కూడా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చాయని తెలిపారు. మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోందన్నారు. అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

రబీ పంట సాగు చేయడానికి రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి నటరాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కొత్తచెరువు మండల పరిధిలోని బైరాపురం గ్రామ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారి నటరాజ్ రైతులకు విత్తన కాయలు పంపిణీ చేశారు. లేపాక్షి, కదిరి 3 రకం విత్తనకాయలు స్టాక్ ఉన్నంత వరకు ఆయా రైతు భరోసా కేంద్రాలలో పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం...

ప్రజాశక్తి - కొత్త చెరువు

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని తలమర్లకు చెందిన కమ్మన్న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పల్లె రఘునాథరెడ్డి మృతుడు కమ్మన్న కుటుంబాన్ని గురువారం పరామర్శించి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా అన్ని విధాలుగా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కమ్మన్న తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలను గుర్తు తెచ్చుకున్నారు. ఈసందర్భంగా మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం తలమర్ల గ్రామంలో అనారోగ్యానికి గురై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి కార్యకర్త రామాంజనేయులు పల్లె రఘునాథరెడ్డి పరామర్శించారు. చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నాగరత్న, టిడిపి నాయకులు ప్రభాకర్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణపై స్థానిక జడ్పీ హై స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఇన్ స్ట్రక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి హెచ్ఎం రామాంజులు యాదవ్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌కు విద్యార్థులను తీసుకువెళ్లి అక్కడి పరిస్థితులపై అవగాహన కల్పించారు. ట్రాన్స్‌ఫార్మర్, ఫంక్షన్ ఫ్లీడర్ పై ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శివయ్య, రమణా నాయక్, రమణయ్య, మురళి పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

ధర్మవరం రూరల్ : పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక యువతను ప్రోత్సహించాలని ఎంపీడీవో సాయి మనోహర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి సూక్ష్మ చిన్న తరహా మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు అర్హులైన వారిని ఎంపిక చేసే విషయంపై శిక్షణ ఇచ్చారు. ఔత్సాహిక యువతను ప్రోత్సహించి, వారికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గురించి వివరించాలని సూచించారు.

బాబ్జాన్‌కు అభినందనలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఆంధ్రప్రదేశ్ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ బాబ్జాన్ పుట్టినరోజు సందర్భంగా మండలానికి చెందిన పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. దిగువ గూటిబైలు గ్రామానికి చెందిన షేక్‌బాబ్జాన్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జయరాములు, దంపెట్ల చిన్న ఇరగప్ప, భాకరాపేట రామంజులు, కృష్ణమూర్తి, రెడ్డప్ప, చెన్న రాయుడు, గంగాద్రి, శంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాబ్జాన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం అందజేత

బాండ్లు చూపిస్తున్న కార్మిక శాఖ అధికారి, నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండలం గోళ్లాపురం పారిశ్రామిక వాడలో ఎ-1 ఇస్పాట్ స్టీలు పరిశ్రమలో గత ఏడాది డిసెంబర్ 12న జరిగిన ప్రమాదంలో మృతిచెందిన బీహార్ రాష్ట్రానికి చెందిన సోమనాథ్ మహ అనే కార్మికుడి కుటుంబానికి పూర్తిస్థాయిలో పరిహారం అందజేశారు. అప్పట్లో యాజమాన్యం మృతుడి భార్యకు రూ.7.50 లక్షలను నష్టపరిహారంగా ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ తదితరులు పరిశ్రమ యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు, కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా కార్మిక శాఖ కేసు నమోదు చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకొని చట్ట ప్రకారం పరిహారాన్ని అందజేయాలని ఆదేశించింది. దీంతో యాజమాన్యం గురువారం మృతుడి తల్లి శారదా దేవి పేరు మీద రూ.1,05,175లవిలువైన చెక్కు, అలాగే కుమార్తె శాలు కుమారికి రూ.1,60,078, కుమారులు నితీష్ కుమార్ పేరిట రూ.1,60,078, అభిషేక్ కుమార్ పేరిట రూ. 1,60,078 ఫిక్స్ డ్ డిపాజిట్లు చేసిన బాండ్లను అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సూర్యనారాయణ కార్మిక నాయకులు రవికుమార్ కు అందజేశారు. కార్మిక నాయకులు చేసిన పోరాటాల ఫలితంగా బాధిత కుటుంబానికి అదనపు పరిహారం ఇప్పించినట్లు కార్మిక సంఘం నాయకులు రవికుమార్ తెలిపారు. దీని ద్వారా సంబంధిత కార్మిక కుటుంబానికి మొత్తం రూ.13,35,409 పూర్తిస్థాయి పరిహారం అందినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు సిద్ధగిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 104 యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జిఎల్. నరసింహులు డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు వివిధ రూపాల్లో నిరసనలు చేస్తున్నారు. అందులో భాగంగా సిఐటియు అనుబంధ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కదిరి 104 సిబ్బంది తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కదిరి ఎమ్మెల్యేకు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు జిఎల్. నరసింహులు మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు. 50 లేదా 60 వేల రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లకు, డిఇఒలకు జీవో నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, సూర్యనారాయణ,దేవ శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ గురువారం హిందూపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులు పట్టణంలోని జామియా అశ్రఫుల్ ఉల్ ఉలూమ్ మదరసాలో ప్రిన్సిపల్ మౌలానా అబ్దుల్ జబ్బార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, మౌలానా ముస్తాక్ అహ్మద్ ను ఘనంగా సన్మానించారు. అదే విధంగా అఖిల భారత ఫ్రీడమ్ ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ కు సన్మానించి, టిప్పు సుల్తాన్ షహీద్ జాతీయ సేవా పురస్కారాన్ని అందజేశారు. టిడిపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాబా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

సమాజ నిర్మాణానికి పాటుపడుతున్న జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్షేమ నిధికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ. లక్ష విరాళం అందజేశారు. గురువారం ఉదయం కదిరి పట్టణంలోని తన నివాసంలో ఏపీయూడబ్ల్యూజే శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు సి. పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి డి. బాబు ఎమ్మెల్యేని కలిసి జర్నలిస్టుల ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అనారోగ్యం, ప్రమాదవశాత్తు జరిగే సంఘటనల నేపథ్యంలో బాధిత జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలన్న సంకల్పంతో ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో సహాయ నిధిని ఏర్పాటు చేసినట్లు యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకి వివరించారు. తమ వంతుగా విరాళం అందించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కందికుంట రూ. లక్ష విరాళాన్ని ఏపీయూడబ్ల్యూజే నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిత్యం సమాజ చైతన్యం కోసం శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం సహాయ నిధిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రసార, ప్రచార మాధ్యమాలు కేవలం సంచలన వార్తల కోసమే కాకుండా వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తలారి నరసింహులు, డాక్టర్ దండం చంద్రశేఖర్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు రద్దు చేయాలి

నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ శిక్షణ తరగతులను తక్షణం రద్దు చేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులను నిర్వహించాలని ఎస్టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడి మధ్య రెసిడెన్షియల్ శిక్షణా తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. ఇదివరకే పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు మానసిక ఒత్తిడి భరించలేక ప్రాణాలు వదలడం బాధాకరమన్నారు. ఒకవైపు మానసిక ఒత్తిడికి గురై ఉపాధ్యాయులు ప్రాణాలు వదలుతున్నా శిక్షణా తరగతులను రద్దు చేయకపోవడం దారుణమన్నారు. పాఠశాలల్లో రోజురోజుకు వివిధ రకాల బోధనేతర పనులతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారన్నారు. ఒత్తిడి మధ్య రెసిడెన్షియల్ శిక్షణ పేరుతో అరకొర వసతులు కలిగిన మారుమూల కేంద్రాలలో శిక్షణలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. వయసు పైబడిన, అనారోగ్య సమస్యలు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న ఉపాధ్యాయులు, మహిళలు, చంటి పిల్లలు కలిగిన ఉపాధ్యాయులు శిక్షణ కేంద్రాలలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే శిక్షణలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు జిల్లా గౌరవాధ్యక్షులు రామాంజులు యాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణా నాయక్, మురళి, శివయ్య, సందీప్, గోవర్ధన్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, రహీం ,రామ్మోహన్, లాలూ సాబ్, షఫీ, ముషీర్ అహ్మద్, సుదర్శన్ గోపాల్, రమణయ్య, ముబారక్ అలీ ఖాన్, వరలక్ష్మీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : రాష్ట్రంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను వెంటనే రద్దుచేయాలని డెమాక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్, డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాల్ట్ పథకం కింద నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణల్లో ఉపాధ్యాయులు మానసికంగా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఆ పరిస్థితుల్లో ఆగిరిపల్లి శిక్షణ కేంద్రంలో రత్నకుమార్, విజయనగరంలో శ్రీనివాసరావు మృతిచెందడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి శిక్షణలన్నీ జిల్లా కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు నర్సింహులు, సోమశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట చెక్ పోస్ట్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందారు. హిందూపురం పట్టణంలోని త్యాగరాజు నగర్‌కు చెందిన పవన్ కుమార్ (23), గాజుల వీధికి చెందిన షేక్ దాదా పీర్ (36) పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో కర్నాటకలోని విదురాశ్వర్థం వెళ్లి తిరిగి వస్తున్నారు. తూమకుంట చెక్ పోస్టు వద్ద హిందూపురం వైపు నుండి తూమకుంట వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను వీరి ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. హిందూపురం రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

బెంగుళూరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టు సమీపంలోని మొరంపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలమత్తూరుకు చెందిన యువకుడు గాయాలపాలయ్యాడు. గ్రామానికి చెందిన బాలక్రిష్ణ అనే యువకుడు ద్విచక్రవాహనంలో చెక్‌పోస్టు వైపు వెళుతుండగా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలక్రిష్ణ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేరాల నియంత్రణకు కృషి : ఎస్పీ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పోలీసులు కలిసి కట్టుగా పనిచేసి నేరాల నియంత్రణకు కృషి చేసి పోలీస్ శాఖపట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంచే విధంగా చూడాలని జిల్లా ఎస్పి వి. రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మవరం మండలం పోతుకుంట పోలీస్ అతిథిగృహంలో ధర్మవరం సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు నెల వారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో, గంజాయి, హత్యనేరాలు, చోరీలు ఎన్ డి పి ఎస్ గ్యాంబ్లింగ్, రోడ్డు ప్రమాదాలు, పెండింగ్ కేసులు తదితర వాటి గురించి ఎస్పీ సమీక్షించారు.. పోలీసు స్టేషన్ల వారీగా కేసులు పెండింగుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చాలా కాలం పెండింగ్లో వున్న కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డిఎస్‌పి శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్య రెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్, రూరల్ సిఐలు, పట్టణ సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

ప్రజాశక్తి నల్లచెరువు

మండలంలోని రెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్‌ను మండల విద్యాధికారి తిరుపాల్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిశీలనలో భాగంగా ఎంఇఒ, సిహెచ్ఓ తో కలిసి ఆన్లైన్ కార్యక్రమాలను రిజిస్టర్లను, హెల్త్ కార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్ రెడ్డమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు హరిత, గాయత్రి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఆశా కార్యకర్తలు సౌందర్య, ఉమా, సంజీవ్ పల్లి ఆశా కార్యకర్త, మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎపియుడబ్ల్యూజె మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో గురువారం ఎపియుడబ్ల్యూజె కదిరి డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షులుగా జి సతీష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి ఫయాజ్ ఖాన్, ప్రభాకర్, జనరల్ సెక్రటరీగా ఎస్ అబ్దుల్ ఘనీ, కార్యదర్శిగా ఎం చంద్ర శేఖర్, ఆర్గనైజింగ్ సభ్యుడిగా కె బ్రహ్మయ్య,గౌరవ సహాదారులుగా డి. నరసింహులు నాయుడును ఎన్నుకున్నారు. సభ్యులుగా డి. శ్రీరాములు, ఎస్ నరసింహులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మండల విలేకరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడండి

ప్రజాశక్తి- బుక్కపట్నం

జిల్లాలోని అడవులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడాలని ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం జిల్లా ఫారెస్ట్ అధికారి చంద్రశేఖర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ ఎండాకాలంలో సహజ వనరులైన అడవులకు నిప్పు పెట్టి తీరని నష్టం కలిగిస్తున్న వాటిని నివారించాలన్నారు.కరువు జిల్లాలో లక్షల ఎకరాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయని వాపోయారు. దీనివల్ల వాతావరణం కాలుష్యం కావడంతో పాటు, అడవుల్లోని జీవరాశుల అంతరించిపోతున్నాయని తెలిపారు. ఫారెస్ట్ బిట్ల పరిధిలో ఒక ఫైర్ వాచర్‌ను నియమించి పరిసర ప్రాంతాలలోని రైతులను పశు వుల గొర్రెల కాపరులను వేటగాళ్లను అడవుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని కోరారు. అడవుల సంరక్షణకు నిధులు వెచ్చించి అడవులను అభివృద్ధి పరచాలన్నారు. ఒక్కసారి అడవులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడగలిగితే తద్వారా అడవులు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం కూడా సహజ వనరులైన అడవులను కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జె. రత్నాకర్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

రత్నాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌ను కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ జులగొండ్ల శ్రీనివాసులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రత్నాకర్ శ్రీనివాసులను అభినందించారు. రాజకీయాల్లో హుందాతనం ప్రవర్తిస్తూ, లభించిన పదవికి న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ ,రమేష్, కేశాని ఆదినారాయణ, తిప్పన్న, బాబయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఓ ప్రైవేట్ విద్యా సంస్థపై చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కొత్తచెరువు మండలంలోని ఆ విద్యాసంస్థలో అర్హత లేని ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, అంతేకాక అధిక ఫీజు వసూలు చేస్తున్నారని విమర్శించారు. బస్సు సౌకర్యం పేరుతో అధిక ఛార్జీ వసూలు చేస్తున్నారని, మౌలిక వసతులు కల్పించలేదని అన్నారు. ఇదే విషయాన్ని గురువారం స్థానిక ఎంఇఒకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

ఉపాధ్యాయుల సెలవులపై పరిమితి తగదు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఉపాధ్యాయుల సెలవులపై పరిమితి విధించడం సరికాదని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పివి రమణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు ప్రత్యేక మరియు సాధారణ సెలవుల వినియోగించుకోవడంపై ఉన్నతాధికారులు ఆంక్షలు విధించడం శోచనీయమన్నారు. వారికున్న సెలవులను అవసరాలకు వినియోగించుకోకుండా ఆదేశాలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేస్తూ ఆపార్ నమోదులో తీవ్ర ఒత్తిడి కి గురవుతున్న ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు సెలవులు మంజూరు కాకుండా ఆంక్షలు వేధిస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి ఆంక్షలు తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన న్యాయమైన బకాయిలు చెల్లించాలని కోరారు.

సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే

నివాళులర్పిస్తున్న నాయకులు

పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె, తదితరులు

మడకశిరలో పూలే విగ్రహం వద్ద నివాళి

ప్రజాశక్తి- హిందూపురం

లింగ వివక్ష, జాతి వివక్ష లేని సమసమాజ స్థాపనకు పరితపించి తన జీవితాన్ని అంకితమిచ్చిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అంటూ వక్తలు కొనియాడారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని సూగూరు గేట్ లో ఉన్న విగ్రహానికి లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, మనోజ్ జూలియట్ శామ్ బాబు, ప్రభుల శివ, జానీ, జాన్ బెన్ని, బాల రాజు, శివ కుమార్, లోకేష్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు మురళీమోహన్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిరావ్ పూలే వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక వైసిపికార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణురెడ్డి, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు లోకేష్, కౌన్సిలర్లు మల్లికార్జున, శివ, నాయకులు నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, నాగరాజు, చంద్రదా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బిఎస్పీ ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు హరి కుమార్, సుబ్బరాయప్ప, గోపాల్, గంగాధరప్ప, చిరంజీవి, పరమేష్, గంగప్ప, సతీష్, సోముశేఖర్, నరసింహ మూర్తి, అనిల్, రవి కుమార్, ఆది తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి లోని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి క్యాంపు కార్యాలయంలో సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే 134వ వర్ధంతి వేడుకలను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు టీడీపీ నాయకులు కార్యకర్తలు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పుట్టపర్తి అర్బన్ : మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిందామని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పిలుపునిచ్చారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని హనుమాన్ సర్కిల్ లో టిడిపి శ్రేణులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ ఇన్‌ఛార్జి జయప్రకాష్, నాయకులు శ్రీనివాసులు, రమణ, మల్లికార్జున, శంకర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలి : బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాజకీయ చైతన్యం తెచ్చిన ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో కూటమి ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలన్నారు. ఎన్టీఆర్ భారతరత్న అవార్డుకు అన్ని విధాలా అర్హుడన్నారు.

మడకశిర : నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మ జ్యోతిబాపూలే అని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో ఉన్న పూలే విగ్రహానికి మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.భూతన్న, కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ అస్పృశ్యత, అంటరానితనాన్ని ఎండగట్టిన గొప్ప సంఘసంస్కర్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీన జనబాంధవుడు, మహిళా విద్యాభివృద్ధికి బాటలు వేసిన విద్యావేత్త, సమ సమాజ స్థాపనలో భావితరాలకు నిత్యస్ఫూర్తి ప్రదాత పూలే అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకోవ డానికి ప్రతిఒక్కరూ నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో గుడిబండ మండల అధ్యక్షులు మూడ్ల గిరియప్ప, నాయకులు ఈశ్వర్, నరసింహమూర్తి, కదిరి శ్రీనివాసులు, ఓబన్న, మహంతేష్, దేవరాజు, హనుమంతరాయప్ప, ఉగ్రనరసింహ, రామాంజనేయులు, సూర్యప్రకాష్, శివప్ప పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని జిల్లేడుగుంట ఎంపియుపి పాఠశాలలో హెచ్ఎం కె.భూతన్న ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, సునీత, కరియన్న, ఇందిరమ్మ, లలితమ్మ, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : మహిళా అభ్యుదయ ప్రదాత మహాత్మజ్యోతిబాపూలే అని వాల్మీకి సంఘం వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు పోగాకు రామచంద్ర పేర్కొన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన పూలే వర్ధంతి సభలో ఆయన పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. రామచంద్ర మాట్లాడుతూ దురాచారాలు, మూఢనమ్మకాలు, సతీసహగమనం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘసంస్కర్త పూలే అన్నారు. స్త్రీలకు విద్య ఎందుకంటున్న రోజుల్లోనే మహిళల కోసం పాఠశాలలను ప్రారంభించి వారి అభ్యుదయానికి కృషి చేశారన్నారు.

గుడిబండ : స్థానిక ఎంజెపి బాలికల కళాశాలలో ప్రిన్సిపల్ ప్రసాద్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.